

## కరీంనగర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు రాధాకృష్ణ

- తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో మధ్యంతర బెయిల్

- వివరాలు 4లో..



## ఘనంగా వాసాల రమేశ్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేపించి అన్నదానం చేసిన అభిమానులు

- వివరాలు 5లో..

- కేక్ తినిపించిన సంజయ్

TELANGANA CAPITAL సంపుటి 01 | సంచిక 12

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

కాంప్లిమెంటరీ కాపీ | కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల | సోమవారం 22 ఏప్రిల్ 2024 | పేజీలు 5

# బెల్ట్ జోరు





### సిట్టింగులకు పర్మిషన్ ఎవరిచ్చారు..?


గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో బెల్ట్ షాపులు నిర్వహించడమే ఎక్కువ. కానీ.. అది చాలదు అన్నట్లు అక్రమంగా సిట్టింగ్ ఏర్పాటు చేస్తూ మందు బాబులను మరింత ప్రోత్సహిస్తున్నారు. రెస్టారెంట్ మాదిరిగా అప్పటికప్పుడు ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్ట్ షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్, ఇంకా మందుబాబుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి ఫుడ్, స్నాక్స్ అందుబాటులో పెడుతున్నారు. వైన్ షాపుల్లో ఎక్కడ చూసినా అమ్మకాలు రోజురోజుకూ పెరగడానికి బెల్ట్ షాపులే కారణమని చెప్పచ్చు.

- ఎన్నికల కోడ్ ఉన్నా ఏరులై పారుతున్న మద్యం
- గ్రామాల్లో సిట్టింగులు పెట్టి మద్యం అమ్మకాలు
- నిద్రపోతున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు
- టార్గెట్‌లు పెట్టి మరీ విచ్చలవిడిగా విక్రయాలు

2

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

జిల్లాలో బెల్ట్ షాపుల దందా 'మూడు బాటిళ్లు.. ఆరు కాసులు' అన్నట్లుగా తయారైంది. ఆబ్కారీశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఓ వైపు దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంటే.. దాంతో తమకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గ్రామాల్లో గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేసింది. అసలే వేసవి కాలం.. ఆపై దాహార్తి ఎక్కువ. చాలా చోట్ల మంచినీటికే సమస్య ఉంది. కానీ.. మద్యం దొరకని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. నివాస గృహాలు, చిన్నచిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారమే మద్యం విక్రయిస్తుండగా.. బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది.



# నేడు వెలిచాల నామినేషన్

- అట్టహాసంగా వేసేందుకు అన్ని ఏర్పాట్లు
- సర్కస్ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- ప్రతిష్ఠాకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ
- టికెట్ అనౌన్స్ కాకున్నా రాజేందర్ రావు వెంటనే లీడర్లు

2

(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)

కాంగ్రెస్ సీనియర్ నేత వెలిచాల రాజేందర్ రావు నేడు అట్టహాసంగా నామినేషన్ వేయబోతున్నారు. భారీ జనసమీకరణ మధ్య ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందులో భాగంగా సర్కస్ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ఇందుకు అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను, అభిమానులు రప్పిస్తున్నారు. కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించనున్నారు. అయితే.. రాజేందర్ రావు పేరును కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ప్రకటించకున్నా.. జిల్లా ముఖ్యనేతలంతా ఆయన వెంటే నడుస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. రాజేందర్ రావే అభ్యర్థి అంటూ ఇండికేషన్స్ ఇచ్చారు.

# గ్రామాల్లో బెల్ట్ జోరు

**ఎన్నికల కోడ్ ఉన్నా ఏరులై పారుతున్న మద్యం**

**గ్రామాల్లో సిట్టింగులు పెట్టి మద్యం అమ్మకాలు**

**నిద్రపోతున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు**

**టార్గెట్‌లు పెట్టి మరీ విచ్చలవిడిగా విక్రయాలు**

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)**

జిల్లాలో బెల్ట్ షాపుల దందా 'మూడు బాటిళ్లు.. ఆరు కాసులు' అన్నట్లుగా తయారైంది. అబ్కారీశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఓ వైపు దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంటే.. దాంతో తమకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గ్రామాల్లో గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేసింది. అసలే వేసవి కాలం.. ఆపై దాహార్తి ఎక్కువ. చాలా చోట్ల మంచినీటికే సమస్య ఉంది. కానీ.. మద్యం దొరకని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు. నివాస గృహాలు, చిన్నచిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయం ప్రకారమే మద్యం విక్రయిస్తుండగా.. బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది.

### వైన్ షాపులకు అనుబంధంగా..

మద్యం విక్రయాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దాంతో ఆ సమయంలోనే గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయి. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పనిచేస్తున్నట్లు సమాచారం. తమ టార్గెట్లు చేరుకొనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్ షాపుల నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్‌పై 20 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా కనీసం 10 వరకు బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. బెల్టు షాపుల కారణంగా గ్రామాల్లోని వైన్ షాపుల్లో కూడా గణనీయంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి.

### సిట్టింగులకు పర్మిషన్ ఎవరిచ్చారు..?

గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో బెల్ట్ షాపులు నిర్వహించడమే ఎక్కువ. కానీ.. అది చాలదు అన్నట్లు అక్రమంగా సిట్టింగ్ ఏర్పాటు చేస్తూ మందు బాబులను మరింత ప్రోత్సహిస్తున్నారు. రెస్టారెంట్ మాదిరిగా అప్పటికప్పుడు ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్ట్ షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్, ఇంకా మందుబాబుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి ఫుడ్, స్నాక్స్ అందుబాటులో పెడుతున్నారు. వైన్ షాపుల్లో ఎక్కడ చూసినా అమ్మకాలు రోజురోజుకూ పెరగడానికి బెల్ట్ షాపులే కారణమని చెప్పచ్చు.



### వైన్ షాప్ యజమానుల సహకారంతోనే..

ఎన్నికల నిబంధనలో భాగంగా లైసెన్స్ పొందిన వైన్ షాప్ మినహా ఎలాంటి బెల్ట్ షాపులు నిర్వహించడానికి వీలు లేదు. కానీ.. జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ యథాతథంగా కొనసాగుతోంది. అయితే.. బెల్ట్ షాపులు కొనసాగడానికి చాలావరకు వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాపులకు మద్యం అమ్ముతూ తమ ఆదాయానికి లోటు లేకుండా చేసుకుంటున్నారని టాక్. ఎక్కువగా అమ్ముడుపోయే బ్రాండ్ మద్యాన్ని బెల్టు షాపులకు ఇచ్చి, వైన్ షాప్ లో కావాలని కొరత సృష్టించి, మద్యం కోసం వచ్చిన వారిని బెల్టు షాపులకు వెళ్లేలా చేస్తున్నారని తెలుస్తోంది. దీనికితోడు బెల్ట్ షాపులకు మద్యం అమ్మకుండా చూడాల్సిన వైన్ షాప్ యజమానులు ఎన్నికల కోడ్ ఉన్నదని బెల్ట్ షాప్‌ల నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకొని సదరు బెల్ట్ షాప్ యజమానికి ఖాతాలు పెట్టి మరీ మద్యం సరఫరా చేస్తున్నారు. అమ్మిన తర్వాత డబ్బులు తిరిగి తీసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారని తెలుస్తోంది.

### ఎక్సైజ్‌శాఖ చర్యలు శూన్యం

గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు కొనసాగుతుండగా అబ్కారీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కోడ్ వేళ అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లిప్తతతో బెల్ట్ షాపు నిర్వాహకులు మరో అడుగు ముందుకేసి మద్యంను కల్తీ చేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మద్యం కల్తీ చేస్తూ విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బెల్టు షాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. అయినా.. ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదు. పైగా వైన్ షాపులు, బెల్టు షాపుల నుంచి నెలవారీ మామూళ్లు అందుకుంటున్నారని బహిరంగంగా ప్రచారం జరుగుతోంది. గ్రామాల్లో బెల్ట్ షాపు యజమానులు ఎన్నికల కోడ్ పేరు చెప్పి, మరి ఎక్కువ రేట్లకు మద్యాన్ని అమ్ముతున్నప్పటికీ బెల్ట్ షాపులను కట్టడి చేయవలసిన ఎక్సైజ్ అధికారులు కనీసం తనిఖీలు చేయడం లేదనే అపవాదు కూడా ఉంది.

## బెల్ట్ షాపులను అరికట్టలేని అధికారులు

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని పలు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల శాఖ అధ్యక్షుడు దొంతరవేణి మహేష్ ఆరోపించారు. ఆదివారం బెజ్జంకిలో విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నా కూడా ఎలాంటి చర్యలు కూడా చేపట్టడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ, ఎలక్షన్ కమిషన్ వెంటనే స్పందించి బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు ఏఐవైఎఫ్ నాయకులు కట్కూరి నరేష్, మోహన్, అంతటి సురేష్, సంగెం రాకేష్ ఉన్నారు.






## కన్నుల పండువగా రథోత్సవం

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం రథోత్సవ కార్యక్రమం కనులపండువగా కొనసాగింది. వేకువ జామునే వేద పండితులు ఆలయంలోని స్వామివారి ఉత్సవమూర్తుల విగ్రహాలను గుడిలో నుండి తీసుకొచ్చి రథంపై ఆశీనులను చేశారు. అంగరంగ వైభవంగా సీతాలక్ష్మణ సమేత రాముల వారి ఉత్సవం విగ్రహాలను శోభయమానంగా అలంకరించి వ్రతంపై అధిష్టించి గ్రామ పురవీధుల గుండా విహరింపజేసి భక్తులను అలరింపజేశారు. భజన బృందాలు, సంకీర్తనల నడుమ కోలాహలంగా భక్తులు రథాన్ని తాడుతో లాగారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీరంగం రామాచార్యులు నిర్వహించగా అన్నాడి వెంకటరెడ్డి, బొబ్బల ఆదిరెడ్డి, మోహన్ రెడ్డి, గ్రామస్థులు హాజరయ్యారు.



## నేడు వెలిచాల నామినేషన్

**(తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ బ్యూరో)**

కాంగ్రెస్ సీనియర్ నేత వెలిచాల రాజేందర్ రావు నేడు అట్టహాసంగా నామినేషన్ వేయబోతున్నారు. భారీ జనసమీకరణ మధ్య ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందులో భాగంగా సర్కస్ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ఇందుకు అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను, అభిమానులు రప్పిస్తున్నారు. కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించనున్నారు. అయితే.. రాజేందర్ రావు పేరును కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ప్రకటించకున్నా.. జిల్లా ముఖ్యనేతలంతా ఆయన వెంటే నడుస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. రాజేందర్ రావే అభ్యర్థి అంటూ ఇండికేషన్స్ ఇచ్చారు.

**నామినేషన్‌కు మంత్రి, ఎమ్మెల్యేలు..**

కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాజేందర్ రావు నామినేషన్ వేయనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీకి జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, లోక్‌సభ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్య నేతలు హాజరుకానున్నారు. కాగా.. ర్యాలీ మధ్యాహ్నం 12 గంటలకు సర్కస్ గ్రౌండ్ నుంచి ప్రారంభం కానుంది. 1గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎన్నికల కార్యాలయంలో వెలిచాల రాజేందర్ రావు నామినేషన్ వేస్తారు. అయితే.. రాజేందర్ రావు అభ్యర్థిత్వాన్ని నేడో రేపో అధిష్టానం ఫైనల్ చేయనున్నట్లు సమాచారం.



## పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**తెలంగాణ క్యాపిటల్, కోహెడ:** కోహెడ మండలం శనిగరం గ్రామంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో గోవిందాంబ సమేత పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవంలో భాగంగా టిపిసిసి ఓబిసి రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఓబిసి మెదక్ పార్లమెంట్ ఇంచార్జీ తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, శనిగరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల యాదగిరి స్వామి వారిని దర్శించుకున్నారు. విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బైరోజు తిరుపతి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరోజు భాను, ఆలయ కమిటీ సభ్యులు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శనిగరం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి కాశవేని శ్రీనివాస్ యాదవ్, విశ్వకర్మ సంఘం సభ్యులు భరత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## దాచారంలో ముగిసిన రథోత్సవం



**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** దాచారం గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన సీతారాముల ఉత్సవ విగ్రహాలతో రథోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సీతాలక్ష్మణ సహిత శ్రీరాముల వారి ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలను ఘనంగా వేద పండితులు నిర్వహించారు. అనంతరం ఆ విగ్రహాలను రథోత్సవంపై ప్రతిష్టించి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా బెజ్జంకి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, రథోత్సవ కార్యక్రమం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశారు.



## పోచమ్మ బోనాలు

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** బెజ్జంకి మండలం శ్రీరాంపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిపై ఎత్తుకొని, డప్పు చప్పులతో గ్రామ దేవత అయిన పోచమ్మకు వద్దకు వెళ్లి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సంవత్సరం సుఖంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకున్నారు.

# సివిల్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకోవాలి

### రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్



**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** యువత సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ గారు పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్ డేను పురస్కరించుకొని కరీంనగర్ మంకమ్మతోటలోని తన నివాసంలో ఆదివారం సివిల్ ర్యాంకర్లకు ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరైన నందాల సాయికిరణ్ (27), కొలనుపాక సహన(729)ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఇవి వేణుగోపాల్ ర్యాంకులు సాధించేందుకు దోహదపడ్డ అంశాలపై ఇష్టాగోష్టిగా చర్చించారు. రాజ్యాంగానికి లోబడి ఉద్యోగ వృత్తిని కొనసాగిస్తూనే సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నేటి యువత సన్మార్గంలో పయనిస్తూ తమ జీవిత లక్ష్యాలను చేరుకొని కీర్తి, ప్రతిష్టలను పొందాలని అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు కూడా నిరాశ చెందకుండా ఉన్నత విద్యాభ్యాసం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి కే. వెంకటేష్, 14వ డివిజన్ కార్పొరేటర్ దిండిగాల మహేష్, న్యాయవాదులు ఉప్పల అంజనీప్రసాద్, ఏ.వి రమణ, ఏ. కిరణ్ కుమార్ మరియు ర్యాంకర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బిజెపిది దేశభక్తి కాదు.. దేశద్రోహం




### బండి సంజయ్‌ని ఓడించండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** బిజెపి దేశ భక్తి ముసుగులో ప్రజలను మభ్యపెడుతూ దేశ సంపదను దోచుకుంటున్నదని, బిజెపికి దేశభక్తి లేదని, మహిళ రెజ్లర్లపై అత్యాచారం యత్నం చేసిన ఆ పార్టీ ఎంపీ బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకోలేదని వారిది దేశద్రోహం అని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు. కోతిరాంపూర్ లోని ముకుందలాల్ మిశ్రా భవన్ లో సిపిఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ... పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి హయాంలోని మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించారని, ఢిల్లీలో 750 మంది రైతుల ప్రాణాలు బలిగొని రైతుల పేరా దొంగ దీక్ష చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమగ్రతకు, సమైక్యతకు విఘాతం కలిగించే విధంగా మతోన్మాదాన్ని పెంచి పోషించిందని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు రోజురోజు పెంచుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న బండి సంజయ్‌ని, అవినీతిలో కూరుకుపోయిన బిఆర్ఎస్‌ను ఓడించాలని, లౌకిక కూటమి అభ్యర్థికి తమ మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, నరేష్ పటేల్, మక్కపల్లి పూజ, నాయకులు గజ్జల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ హెచ్చరికలు బేఖాతరు

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** మహావీర్ జయంతి సందర్భంగా మండలంలో జంతుబలులు చేయకూడదని గ్రామపంచాయతీ కార్యనిర్వహకవర్గం శనివారం హెచ్చరికలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గ్రామపంచాయతీ అధికారులు హెచ్చరికలను జారీ చేశారు. కానీ.. గ్రామంలో వాటిని బేఖాతరు చేస్తూ యథాతథంగా వారి కార్యకలాపాలు కొనసాగించారు. ఇక గ్రామపంచాయతీ అధికారుల విషయానికొస్తే పై అధికారుల సూచన మేరకు తాము అనౌన్స్ చేశామని, తమకేం పనిలే అనుకొని మిన్నకున్నారు.

## వడ్లూరులో పోచమ్మ బోనాలు

**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని వడ్లూరు గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఈ బోనాలు గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం జరిగే ఎల్లమ్మ సిద్ధోగంలో భాగంగా గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించినట్లు గౌడ కుల సంఘ పెద్దలు తెలిపారు. పలువురు మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని, డప్పు చప్పుళ్లతో వెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.



GENERAL NEWS

# వయస్సు శరీరానికే..

## హైకోర్టు రిటైర్డ్ జడ్జి జెజ్జారం చంద్రకుమార్

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ టౌన్:** వయస్సు శారీరానికే కాని మనసుకు కాదని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఎస్‌బిఎస్ ఫంక్షన్ హాల్‌లో కరీంనగర్ జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ విశ్రాంత ఉద్యోగుల సహస్ర చంద్ర దర్శకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశిష్ఠ అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సద్గుణ సంపత్తి గలవారి జీవితాలు ఎల్లప్పుడూ సమాజానికి అనుసరణీయమే అన్నారు. మహానుభావులు తమ చైతన్యశక్తిని సమాజానికి అందించాలన్నారు. ఎంత మితంగా మాట్లాడితే అంత మేలు జరుగుతుందన్నారు. వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ మన జీవితం నాలుగు దశలనూ అధిగమించి అంత్యకాలంలో రాలిపోవాల్సిందేనని కాని మనిషి జీవితం అర్ధాంతరంగా అర్థరహితంగా ముగిసిపోకూడదన్నారు. మన జీవితాలు ఇతరులను చీకటి నుండి వెలుగుకు మళ్లించే మార్గదర్శకాలు కావాలన్నారు. వోపా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కట్ట విష్ణువర్ధన్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర



విశ్వహబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్‌మోహన్ ఆచార్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, మొగ్గుంపూర్ విశ్వబ్రాహ్మణ కాలనీ అధ్యక్షులు గద్దె సత్యనారాయణతోపాటు యాస్వాడ అంజయ్య, బండ్ల శివప్రసాద్, వంగల అనోధరాచారి, ఎర్రోజు భీష్మాచారి, తిప్పర్తి అంజయ్య తదితరులు పాల్గోనగా సహస్ర చంద్ర దర్శకులు తిప్పర్తి ఆనందం నాగలక్ష్మి, సంగోజు రామక్రిష్టయ్య వజ్రమ్మ, శ్రీరామోజు చిరంజీవాచారి లలితాదేవి. కొత్తూరి శంకరయ్య సరోజ, గౌరీశంకర్ యశోద, వెంకటేశ్వర్లు రాజలక్ష్మి, వడ్లూరి వెంకటేశ్వర్లు చంద్రకళ దంపతులను ఘనంగా సన్మానించారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండగ

**తెలంగాణ క్యాపిటల్, గంగాధర:** గంగాధర మండలం మధురానగర్‌లో పోచమ్మ తల్లి బోనాలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిక అని అన్నారు. పోచమ్మ తల్లి ప్రతి ఊరి గ్రామ దేవత అని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ప్రజలు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సత్తు కనకయ్య, చందు, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, బిట్టు తదితరులు పాల్గొన్నారు.





# బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

**తెలంగాణ క్యాపిటల్, గంగాధర:** గంగాధర మండలం మధురానగర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ పడితేపల్లి కిషన్, చొప్పదండి మండల మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణాహరి,మాజీ జెడ్పిటిసి గునుకొండ బాబు, మాజీ వైస్ ఎంపీపీ కర్ర బాపురెడ్డి, చిన్న అచంపల్లి సర్పంచ్ దోర్నాల హన్మంతరెడ్డితోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు 100 మంది వరకు ఉన్నారు. బిఆర్ఎస్ పార్టీలో కార్యకర్తలకు విలువ లేదని, పార్టీ కోసం పనిచేసిన వారిని నిర్లక్ష్యం చేసి, ప్యారాచూట్ నాయకులకే ప్రాధాన్యత ఇచ్చారని నాయకులు తెలియజేశారు. బిఆర్ఎస్ పార్టీ విధానాలు నచ్చకనే పార్టీకి రాజీనామా చేసినట్టు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు నాయకులు తెలిపారు.

## కరీంనగర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసు

# నిందితుడు రాధాకృష్ణ

### తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో మధ్యంతర బెయిల్



**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ క్రైం:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ జ్యుడిషియల్ రిమాండులో ఉన్న రాధాకృష్ణ భారీ బందోబస్తు మధ్య ఆదివారం కరీంనగర్‌కు చేరుకున్నారు. తన తల్లి సరోజిని దేవి(98) అనారోగ్యం బాధపడుతుండడంతో ఆమెను స్థానిక సాగర్ ఆసుపత్రిలో జాయిన్ చేశారు. మార్చి 12న అనారోగ్యం బారిన పడడంతో సాగర్ ఆసుపత్రి ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రాంకియాసిస్ వ్యాధితో బాధపడుతున్న సరోజనమ్మను చూసేందుకు అనుమతి ఇవ్వాలని రాధాకృష్ణ కోర్టు అనుమతి కోరారు. దీంతో ఆదివారం 11 గంటల నుండి 3 గంటల వరకు కరీంనగర్ సాగర్ ఆసుపత్రికి వెళ్లి ఆయన తల్లి సరోజనమ్మను చూసేందుకు కోర్టు అనుమతించింది. జ్యుడిషియల్ రిమాండ్ లో ఉన్న ఖైదీ కావడంతో రాధాకృష్ణకు ఎస్కార్ట్, పైలెట్ వాహనాలను ఏర్పాటు చేసి మరీ కరీంనగర్ కు తరలించారు. తల్లితో దాదాపు నాలుగు గంటలపాటు ఆసుపత్రిలో గడిపిన రాధా కిషన్ రావును కోర్టు ఇచ్చిన సమయం ముగియడంతో తిరిగి హైదరాబాద్ చంచల్ గూడ జైలుకు తరలించారు.

## ఉపాధి హామీ పనికి వెళ్తూ..



**తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బండి పెల్లి సత్యనారాయణ, ఆయన భార్య స్వప్న, మేకల శోభ ముగ్గురు ద్విచక్ర వాహనంపై గ్రామంలోని కుంటలో ఉపాధి హామీ పనులను చేయటానికి ఉదయం వెళ్లారు. మార్గమధ్యలో నల్లాల బావి వద్ద కోతులు అడ్డురావడంతో ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో సత్యనారాయణ కింద పడ్డాడు. ఈ క్రమంలో సత్యనారాయణ కాలు విరిగింది. ఆయన భార్య స్వప్నకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు వెంటనే కరీంనగర్‌లోని ఆదిత్య ఆసుపత్రిలో పక్షం రోజులు చికిత్స పొంది శనివారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో బండిపెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తనకు మూడు లక్షల పదివేల రూపాయలు ఆసుపత్రిలో ఖర్చు అయ్యాయని, తాను పేదరికంతో ఉన్నానని, ఆర్థిక సహాయాన్ని ఉపాధి హామీలో కల్పించాలని, లేదా సీఎం రిలీఫ్ ఫండ్ అయినా ఇవ్వాలని వేడుకున్నారు. అయితే.. సాయం మాట దేవుడెరుగు. కనీసం గ్రామ స్పెషల్ ఆఫీసర్ గానీ, కార్యదర్శి గానీ, ఏపీఎం గానీ ఇంతవరకు తనను పరామర్శించడానికి రాలేదని ఆయన ఆవేదన చెందారు.




## పెద్ద లింగాపురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**తెలంగాణ క్యాపిటల్, ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట మండలంలోని పెద్ద లింగాపురం గ్రామంలో బాబు జగ్జీవన్ రావ్ వ్యవసాయ కళాశాల నాలుగవ సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవా పథకం కింద ప్రత్యేక శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం వయ్యారిభామ మొక్క ప్రభావం గురించి గ్రామ రైతులకు, ప్రజలకు వివరించారు. వయ్యారి భామను శాస్త్రీయ భాషలో పార్థీనియం మొక్కగా పిలుచుకుంటారు. దీని నష్టాలు రైతులకు విద్యార్థులు వివరించారు. దీనిని మొక్క దశలోనే పీకి పారేయాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌-ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.అరుణ్ బాబు, కే.భవ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అమెరికాలో హుజూరాబాద్ విద్యార్థి మృతి

**తెలంగాణ క్యాపిటల్, హుజూరాబాద్:** అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫినిక్స్ ప్రాంతంలో హుజూరాబాద్ కు చెందిన ముక్క నివేష్ (20) మృతిచెందాడు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ముక్క కృష్ణమూర్తి మనువడు, డాక్టర్ నవీన్, స్వాతిల కుమారుడు నివేష్. నివేశ్ గతేడాది జనవరిలో ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ చేయడానికి ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీలో జాయిన్ అయ్యాడు. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం కళాశాలకు వెళ్లి తిరిగి కారులో వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో నివేష్ తో పాటు తన సహచర విద్యార్థి గౌతమ్ సైతం మృతి చెందినట్లు నివేష్ పేరెంట్స్ చెప్పారు.

TELANGANA CAPITAL
తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
www.telanganacapitalnews.com

GENERAL NEWS

## వధూవరులను ఆశీర్వదించిన వెలిచాల



**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్:** నూతన వధూవరులను కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ఆశీర్వదించారు. వెలగందుల సత్యనారాయణ కుమారుడు సాయికిరణ్, బండి అంజలి కుమార్తె శిల్పశ్రీల వివాహ వేడుక కరీంనగర్ నగరంలోని వైశ్య భవన్ లో ఆదివారం జరిగింది. వివాహ వేడుకకు హాజరైన వెలిచాల రాజేందర్ రావు నవదంపతులను ఆశీర్వదించారు.

## ఘనంగా వాసాల రమేశ్ జన్మదిన వేడుకలు



**తెలంగాణ క్యాపిటల్, కొత్తపల్లి:** కొత్తపల్లి మాజీ ఎంపీపీ, పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు వాసాల రమేశ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లిలో ఆయన అభిమానులు, బీజేపీ నాయకులు కేక్ కట్ చేయించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బండి సంజయ్ కుమార్ కేక్ కట్ చేయించి తినిపించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ వేముల చంద్రశేఖర్, స్వర్గం నర్సయ్య, వాసాల యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అబద్ధాలు చెప్పి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్

### కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్:** కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలు నట్టేట మునిగారని.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెబుతారని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకున్నది ఉన్నది ఊడగొట్టడానికి కాదని.. కాంగ్రెస్ వస్తే ఇంకొదో మేలు చేస్తారని ఆశపడి ఓట్లు వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచే విధంగా వ్యవహరిస్తోందని.. ఉద్ధరిస్తారనుకుంటే.. ఉన్నది ఊడగొడుతున్నారని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కొత్తపల్లి బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు.





# నన్ను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు

### అందుకే ఇప్పటివరకు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించలేదు

### సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం ముమ్మాటికీ బీఆర్ఎస్‌దే..

### బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

**తెలంగాణ క్యాపిటల్, సిరిసిల్ల:** తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని, అందులో భాగంగానే నామినేషన్ల పర్వం ప్రారంభమైనా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఇంతవరకు ప్రకటించలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొన్న బండి సంజయ్ నాటి మంత్రి కేటీఆర్ తాను ప్రతిపాదించిన కొన్ని కంపెనీల వద్దే యార్న్ కొనుగోలు చేయాలని షరతు పెట్టడంతో అధిక ధరకు యార్న్ కొనుగోలు చేసిన నేతన్నలు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. యార్న్ కొనుగోలులో అక్రమాలపై విచారణ జరపాలని సవాల్ విసిరారు. ఆదివారం సిరిసిల్ల విచ్చేసిన బండి సంజయ్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నుండి టౌన్ మొత్తం తిరుగుతూ శాంతినగర్ హనుమాన్ ఆలయ సమీపం వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ధూమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బండి సంజయ్ తోపాటు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవి, జిల్లా అధ్యక్షులు ప్రతాప రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ తదితరులు హాజరయ్యారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభం సమసిపోలేదని, ముఖ్యమంత్రికి తాను లేఖ రాసి అనేక రూపాల్లో సర్కార్ తీరును ఎండగట్టినట్లు చెప్పారు. దీక్ష చేసేందుకు సిద్ధమైతేే తప్ప ప్రభుత్వం దిగిరాలేదని, రూ.270 కోట్ల బకాయిలుంటే.. కంటి తుడుపు చర్యగా రూ.50 కోట్లు రిలీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారణం ముమ్మాటికీ బీఆర్ఎస్సే అని, మాస్టర్ వీవర్స్ పేరుతో పెద్ద యజమానులకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి చిన్న యజమానులను, ఆసాములుగా కూలీలుగా మార్చిన ఘనత కేసీఆర్ దేనని విమర్శించారు. ప్రతి ఒక్కరూ పువ్వు గుర్తుపై ఓటేసి బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

### గీత కార్మికులను ఆదుకునే సోయి లేదా?

రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు కష్టాల్లో ఉన్నారని, వారిని ఆదుకోవాలని సోయి కూడా ప్రభుత్వానికి లేకుండా పోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ప్రతి గ్రామంలో 5 ఎకరాల భూమి కొని ఈత మొక్కలను పెంచుతామని, ఈత మొక్కల పెంపకానికి, బిందు సేద్యానికి 90 శాతం సబ్సిడీ ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గౌడన్నల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న పేరును జనగామ జిల్లాకు పెడతామని ఎన్నికల్లో ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని తాడూరు గ్రామానికి విచ్చేసిన బండి సంజయ్ కాలిపోయిన తాటి చెట్లను పరిశీలించారు. అక్కడున్న గీత కార్మికులు, స్థానికులతో మాట్లాడారు. నష్టపోయిన గౌడన్నలను పరామర్శించారు. 'గౌడన్నలు ప్రమాదవ శాత్తు చనిపోతే పైసలివ్వడం కాదు. బతికున్నప్పుడు ఉపాధి కల్పించడం లేదు. తెల్లవారుజామున లేచి మోదు కట్టుకుని చెట్లు ఎక్కి కల్లు గీస్తుంటే.. తాటి చెట్ల దగ్గర డ్రంక్ అండ్ డ్రైవ్ పెట్టి వేధిస్తే కల్లు తాగడానికి ఎవరొస్తారు? మద్యం షాపులు దగ్గర కమీషన్లు సంపుకుంటరు.. ఆరోగ్యకరమైన కల్లు తాగేటోళ్లను రాకుండా చేస్తరు. గీత కార్మికుల సంక్షేమమంటే ఇదేనా? ఇప్పటికైనా ప్రభుత్వం గీత కార్మికులను ఆదుకోవాలి' అని డిమాండ్ చేశారు.

# ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన నలుగురిపై కేసు

**తెలంగాణ క్యాపిటల్, కరీంనగర్ క్రైం:** నకిలీ ధృవపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదైంది. అందులో ఇద్దరు పరారీలో ఉండగా, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ.ప్రదీప్ కుమార్ తెలిపారు. గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య పవర్ లూమ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని సర్వేనెంబర్ 233/ఈలో ప్లాట్ నెంబర్ 16, తూర్పు ముఖంగా 50 ఫీట్ల వెడల్పు రోడ్డు కలిగిన 293.33 చదరపు గజాల స్థలాన్ని 2003 సంవత్సరంలో మూల గౌరా రెడ్డి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. గౌరా రెడ్డి మరణానంతరం అతని కొడుకైన మూల తిరుమలరెడ్డి గతంలో తమకు విక్రయించిన తమ ప్లాట్లకు గల 50 ఫీట్ల రోడ్డు వారికి చెందిందేనని, దానిని ఆక్రమించి రెండు ప్లాట్లుగా విభజించి తిరుమల రెడ్డి తల్లి అయిన మూల వీరమ్మ (గౌరా రెడ్డి భార్య) పేరిట తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి దానిని మూల సూర్య ప్రకాష్ రెడ్డి, లంక శేఖర్ లకు విక్రయించినట్లుగా తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించారు. వాటి ఆధారంగా గోడను సైతం సృష్టించారని, విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ పోలీసులు, బాధితుడు ఫిర్యాదులో తెలిపిన విషయాలు నిజమేనని తేలినందున నలుగురిపై కింద కేసు నమోదు చేశారు. అందులో ఏ1, ఏ2లు అయిన మూల తిరుమలరెడ్డి, లంక శేఖర్ లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులిద్దరినీ కరీంనగర్ జైలుకు తరలించారు.




తెలంగాణ క్యాపిటల్ పేపర్‌లో వార్తల కోసం ఈ నంబర్‌లో సంప్రదించగలరు : 92949 92992